# కుబ్జ

వడ్డాది పాపయ్య

[భాగవతములోని 'కుబ్జ' పాత్రకు యిదొక కల్పన. ఊహాకల్పన. తుది యత్నమొక్కటిమాత్రమే పౌరాణికము. ఇందులో రాజు—కంసుడు. కృష్ణసర్పం—కృష్ణుడే. రక్తాంగి, నవనీత—కుబ్జ—కథానాయిక. ప్రతిఘట్టములోనూ సూత్రప్రాయంగా నడిచిపోతుంది. ఇంకా గోపికలూ, సరంగు, కావలివాడూ వున్నారు. పాత్రల పేర్లు ముందుంచి నాటికగా వుంచేకంటే యిలానే చిన్నచిన్న ఘట్టాలతో కేవలం సంభాషణామాత్రంగా వుంటేనే వుత్సుకత వుంటుందని వుంచేశాను. మనసులోని మాటల్ని తెలియబర్చటానికి, తమాషాకు—అద్దంలోని ప్రతిబింబము మొదలైనవాటిచేత మాట్లాడించాను, యిది అసహజమైనా—కొంత వింతగా—క్రొత్తగావుంటుందని వుద్దేశించాను. ఇట్టివి సినీమాల్లో చూస్తూనేవున్నాము. పౌరాణిక వ్యక్తులని విరళించకుండా, కల్పనను చూస్తారని ఆశ. పాత్రల ఔచిత్యమూ, కథాకల్పనలోని వింతపోకడ కొంతయినా ఆదరిస్తారని నమ్మిక,—కృష్ణప్రేమకిదొక రూపము. అదెంతవరకు ఔన్నత్య దశపొందిందో చదివి నిర్ణయింతురుగాక.]

●

రాజుముందర ౧

'సూర్యాస్తమయానికిముందే నీవు పయనం కావచ్చును'.

'ప్రభూ ! కనుపించటంలేదా, యెదురుగా ఆ చెరసాల అపరంజి తలుపులు యెఱ్ఱనెండలో కరిగిపోతున్నట్టు'

'అవును. కాంచుటలేదు. అస్తమయం సమీపించిందా ? కవాటములు కరుగుతున్నవా ?!'

'ప్రభువులమనస్సు కలతగా—వున్నట్లుంది'.

'ఔను. ఆ కలతను తొలగించటానికే యీ కపట నాట్యానికి నిన్నే యెన్నుకున్నందుకు సాధించాలి. హృదయంలోని దుర్బలనాళాల్ని త్రెంచుకోవాలి.'

'మధురాపతీ ! కన్నెప్రాయంనుండి యింతవరకు రాజసేవలో కత్తివంచనన్నమాట యెరగను. నిస్సంకోచమైన మీ ఆనతిచాలును.'

'కావచ్చునుగాని ఆ విపరీత కాంతాలోల కాలసర్ప నిర్మూలానికి నీ విలాసమెంత తగివున్నదో, నీ యువతీత్వం వానిముందు అంతగా కరిగిపోతుందేమోనని నీ అప్రమత్తతకోసం చెప్తున్నాను.—మరి ఆ చీనాంబరాలమాట మరిచిపోకుమీ !—వెన్నెలను చిమ్ముతూ లోనిమంట ఆరకుండా ప్రజల్వించాలి.

అద్దంముందు ౨

'ఇంత చక్కగావున్నానా ?! లేక యీ రాత్రీ, యీ అద్దం మోసగిస్తున్నాయా ?!

ప్రతిబింబం—నేను రక్తాంగినే !

'నీవా ! నీకాపేరు తగదు'.

ప్రతిబింబం—'అయితే రక్తాంగిని'.

'అదీ బావులేదు'.

ప్రతిబింబం—'సరే నవనీతను'.

'నవనీత !—అదీ, అందకత్తైనంటూ యే గొల్ల పిల్ల నీముందు నిల్చోగలదు ? నీవాపల్లెకుపో-మొదటి చూపుకే లొంగిపోతుందా 'కృష్ణ' సర్పకిశోరం-యేదీ ఆ చెక్కిళ్ళను ముద్దుపెట్టుకోనీ—అబ్బ !! ఎంత చల్లగావుందీ అద్దం !!

## పడవలో ౩

మెరుస్తున్న చిన్నకత్తి—'నన్ను, మరిచి పోకేం'

'నిన్నా ! రాజహస్తాలనుండి నియోగింపబడి ఆ చిన్నమధుపం వేడిరక్తాన్ని చవిచూట్టానికి తహతహలాడే నిన్నా ! మరవను'.

కత్తి—'ఆ మధుపానికి నా మొననివున్న విషమనే మకరందాన్ని యివ్వగలను'.

'కాని స్త్రీ సౌందర్యానికి, ఆకర్షణకు, విలాసానికి నీవిచ్చే గౌరవార్హతలింతేనా ?

దంతప్పెట్టెలోనుండి—'చంద్రకిరణాలనే తలా, ౘాచుపొరల్లాంటి మాపయ్యెదల్లో, విడీవిడని పూవులోని మకరందమల్లే నిన్ను భ్రాన్సిల్లజేయడం నీకు గౌరవముకాదా ! మీగడ తట్టుకట్టుపుట్టములం తెరిచిచూడు—'

'ఇంకా ! ఆ సమయంరా లేదు'. అయస్కాంతములా ఆ యినుపముక్కని నీ కౌగిలికి తహతహపడే అదనులో, యీ చీనాంబరములు కట్టుకుని, నీ కౌగిటిలో మమత ఘట్టి నీకార్యము నెరవేర్చుకోగలవు నిరంతరాయముగా—యీ అలంకరణముతో నీవు వాడికళ్ళని చీకటిబుచ్చగలవు-కాని చాపల్యంకొద్దీ, అంతకుముందు తెరిచి తాకనైనా వద్దని 'రాజు నొక్కి చెప్పాడు ; అందులోని రహస్యమేమిటో అయినా మీరను—హ్మ్మ్ ! మేలుకునివున్నానా ?—కలగంటున్నానా— యిదేం! పడవకూడా నిద్రిస్తున్నదా ?! కలకంటూన్నదా—అదిగో-చక్కని భూపాలరాగం మురళిపాడుతోంది. అతనికి మురళివాయించడము అలవాటట.—కోడికూడా కూస్తున్నదే—

## యమున ఒడ్డున ౪

'ఈ యమున కెరటాలకు, లేయెండ తళతళ బంగారుపూవులు జల్లుతున్నది. ఇవి సైకతసీమలా?-' స్వర్గసీమలా !! యీ నిండు సౌందర్యాన్నెలా చీల్చుకు పోగలనూ ? యెక్కడికి ?—ఆ మురళీ మధురగీతమే నన్ను లాక్కుపోతున్నది.

## గోపికలతో ౫

'పిల్లా యెవరేనీవు ?'

'.........'

'మాట్లాడకనీ నోట్లోనివెన్న జారిపడిపోతుంది'.

'మీరందరూ యెవరో, నేనూ అదే, కనుపించటంలేదూ ?'

'రాసా మెల్లిగా మాట, యీమె అసాధారణముగా మెరుస్తోందే'.

'ఔనే వెన్న యీరూపముదాల్చి ప్రతీరాత్రీ విహరిస్తున్నదేమోననిపిస్తోంది'.

'నీపేరు చెల్లీ ?

'నవనీత'

'ఎందుకున్నావిక్కడ.'

'వెన్నెందుకున్నా దీ పల్లెలో అంటావా, అందుకేనా.

అయితే నవనీతం మాయింటిసొమ్ము—రాపోదాము.

ఉహుం మాయిల్లే వెన్న, మా యింటికే రావాలి.—

'ఇంత కమ్మగా మాట్లాడ మెలా అబ్బిందీ మీకు ?'

'గడుసుదానివే, వసంతంలో కోయిల కోయిలను అడిగిందిట.

'ఇంతకమ్మగా యెలా కూస్తున్నావే ?' అని.

(సశేషం)